## లక్ష్యసాధనతో విద్యార్థులు ముందుకెళ్లాలి

**జిల్లా జడ్జి సునీత కుంచాల**




మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

డిచ్‌పల్లి, అక్టోబర్ 30: విద్యార్థులు ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా ముందుకు సాగాలని అప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలను బుధవారం ఆమె సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కష్టపడి చదవాలని సూచించారు. గురుకుల విద్యాలయాల్లో ప్రభుత్వం అందిస్తున్న అన్ని వసతులను అందిపుచ్చుకుని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. నేటి సమాజంలో ఆడపిల్లలకు ఆత్మరక్షణ చాలా ముఖ్యమని, అందుకోసం శిక్షణ తీసుకుని తమను తాము కాపాడుకోవాలన్నారు. ఆడపిల్లలకు ఏదైనా సమస్య ఉంటే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. 18 ఏండ్లు నిండని వారు వాహనాలు నడిపిస్తే చట్టరీత్యా శిక్షకు అర్హులని తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో నెగ్గకపోతే నిరాశ పడకుండా మళ్లీ ప్రయత్నించాలని, అప్పుడే విజయం తప్పక వరిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, డాక్టర్ రాజశ్రీ, ఎస్సై మహ్మద్ షరీఫ్, ప్రిన్సిపాల్ నళిని పాల్గొన్నారు.

## రేపు ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపిక పోటీలు

కంఠేశ్వర్, అక్టోబర్ 30 : ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 సాఫ్ట్ బాల్ బేస్‌బాల్ ఎంపిక పోటీలు నవంబర్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల, బాలికలకు డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి బాలికల సాంఘిక సంక్షేమ కళాశాలలో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

**2న సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు**

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని విజయ్ హైస్కూల్‌లో నవంబర్ 2 న 70వ ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళ, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేశ్, శ్యామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

## నియామక పత్రాల అందజేత

ఖలీల్‌వాడి, అక్టోబర్ 30 : రీజియన్ పరిధిలో కారుణ్య నియామకాల్లో భాగంగా 33 మంది పురుష అభ్యర్థులు, కరీంనగర్ రీజియన్‌లో 18 మంది మహిళా అభ్యర్థులను నిజామాబాద్ రీజియన్‌లో కండక్టర్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ మేరకు వారికి బుధవారం నియామక పత్రాలను రీజినల్ మేనేజర్ జానీరెడ్డి అందజేశారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

వేల్పూర్, అక్టోబర్ 30: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. హెచ్ఎం రాజన్న మాట్లాడుతూ వచ్చేనెలలోనిర్వహించనున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు గ్రామాభివృద్ధి కమిటీ వీటిని అందజేసిందన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు పురుషోత్తం, సెక్రటరీ నరేందర్, వీడీసీ ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

## కులసర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ

మోర్తాడ్/బోధన్ రూరల్/ఏర్గట్ల/బాల్కొండ/ నవీపేట/ధర్పల్లి/ సిరికొండ/ ఇందల్వాయి/ఖలీల్‌వాడి/రుద్రూర్, అక్టోబర్ 30: వచ్చేనెల 6 నుంచి ప్రభుత్వం నిర్వహించన్ను ఇంటింటి సర్వేలో పాల్గొననున్న ఎన్యుమరేటర్లకు జిల్లా వ్యాప్తంగా వివిధ మండల కేంద్రాలు, పట్టణాల్లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వేలో సేకరించాల్సిన సమాచారంపై అధికారులు అవగాహన కల్పించారు. బోధన్‌లో వెన్యుమరేటర్ల శిక్షణ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడారు. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లిలో ఆర్డీవో రాజేందర్ మాట్లాడారు.

## దైవభక్తితో మానసిక ప్రశాంతత

నవీపేట, అక్టోబర్ 30: ప్రతి ఒక్కరూ దైవ భక్తిని కలిగి ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజయోగి సిద్దేశ్వర మహరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని లింగం గుట్టపై ధన త్రయోదశి, అష్టలక్ష్మి, కుబేర మహాపూజ చేపట్టారు. 108 మంది జంటలు సామూహిక కార్యక్రమంలో పాల్గొన్నాయి. మహరాజ్ భక్తులకు ప్రవచనాలు చేశారు.

### తప్పిపోయిన బాలుడు..
### గంటల వ్యవధిలో సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు

వినాయక్‌నగర్, అక్టోబర్ 30: నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అహ్మదీ మార్కెట్‌లో తన కుటుంబ సభ్యుల నుంచి ఓ బాలుడు తప్పిపోయాడు. సదరు బాలుడిని స్థానిక వ్యాపారులు గమనించి పోలీసులకు అప్పగించారు. బాలుడి ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో విషయం తెలుసుకున్న మాలపల్లి ప్రాంతానికి చెందిన షేక్ రిజ్వాన్ పోలీసుస్టేషన్‌కు వచ్చాడు. బాలుడు తన కుమారుడని చెప్పడంతో అప్పగించినట్లు ఎస్సై యాసిర్ ఆరాఫత్ తెలిపారు.

# బీఆర్ఎస్ సంబురాలు

**విద్యుత్ చార్జీల పెంచాలన్న ప్రభుత్వ ప్రయత్నానికి చెక్**





జిల్లా కేంద్రంతోపాటు ఆర్మూర్ పట్టణంలో స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 30: విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల భారాన్ని వేసేందుకు సిద్ధమైన ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుని విజయం సాధించిన సందర్భంగా జిల్లాలోని పలుచోట్ల బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం సంబురాలు నిర్వహించాయి. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పటాకులు కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడారు. పార్టీ నాయకులు రాంకిషన్‌రావు, సిర్ప రాజు, సూదం రవిచందర్, దండు శేఖర్, సత్య ప్రకాశ్, మురళి, ఇక్బాల్, రాజు, గంగామణి, శంకర్, రవి, ప్రసాద్, సంతోష్, శివకుమార్, శంకర్, శేఖర్, రాజు, ఫయీం ఖురేషి, అనిల్, సాదిక్ పాల్గొన్నారు.

**ప్రజల పక్షాన, ప్రజల కోసం పోరాటానికి సిద్ధం**

మోర్తాడ్, అక్టోబర్ 30: ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నా, ప్రజలకు సమస్యలు తీసుకువచ్చినా ప్రజల పక్షాన పోరాటానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని బీఆర్ఎస్ మోర్తాడ్, భీమ్‌గల్, ముప్కాల్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాల అధ్యక్షులు కల్లెడ ఏలియా, దొన్కంటి నర్సయ్య, ముస్కు భూమేశ్వర్, రాజపూర్ణానందం, రేగుంట దేవేందర్ అన్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై వేయాలనుకున్న భారాన్ని బీఆర్ఎస్ అడ్డుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజల తరపున బీఆర్ఎస్ శ్రేణులు నియోజకవర్గస్థాయిలో మోర్తాడ్‌లో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాల్కొండ, మెండోరా, వేల్పూర్ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నాగధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు బద్దం రవి, చౌట్‌పల్లి రవి, రాష్ట్రనాయకుడు చిన్నారెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లెం అశోక్, గడ్డం స్వామి అన్ని మండలాల నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆర్మూర్‌లో..**

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్30: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, మీరా శ్రావణ్, అలూర్ క్రాంతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## డిచ్‌పల్లిలో పవర్‌గ్రిడ్ ఉద్యోగుల ర్యాలీ

డిచ్‌పల్లి, అక్టోబర్ 30 : అవినీతి నిర్మూలన అందరి బాధ్యత అని మిట్టపల్లి పవర్‌గ్రిడ్ సీనియర్ డీజీఎం ప్రభాకర్ అన్నారు. అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని డిచ్‌పల్లి మండల కేంద్రంలో పవర్‌గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అవినీతిని అంతమొందించడానికి అందరూ సహకరించాలని కోరారు. దేశం అభివృద్ధి చెందాలంటే అవినీతిని అంతమొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ర్యాలీలో సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరికొండ, అక్టోబర్ 30 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేశ్ డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు ఆర్.దామోదర్, లింబాద్రి, సాయరెడ్డి, రమేశ్, కిశోర్, అనీష్, ఆశిస్, రాములు, బాలయ్య, రణధీర్ పాల్గొన్నారు.

## హమాలీలకు దుస్తుల పంపిణీ



హమాలీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ సంధ్య

బోధన్, అక్టోబర్ 30: దీపావళి పండుగ సందర్భంగా బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం హమాలీ కార్మికులకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సంధ్యాదామోదర్ దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

## పొగాకు బట్టీలు దూరంగా ఏర్పాటు చేయాలి

రెంజల్, అక్టోబర్ 30: కందకుర్తిలో పొగాకు రంగు మార్చేందుకు గుడారాలను(బట్టీ) గ్రామానికి కిలోమీటరు దూరంలోని వ్యవసాయ భూముల్లోనే ఏర్పాటు చేసేలా చర్య తీసుకోవాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, ఎస్సై సాయన్న, గ్రామప్రత్యేక అధికారి రఫియొద్దీన్‌కు గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో కొంత కాలంగా పొగాకు సాగు చేస్తున్న రైతులు కోత అనంతరం రంగు మార్చేందుకు గుడారాలు జనవాసాలు, పాఠశాలలకు ఆనుకొని ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. జనావాసాల మధ్య ఏర్పాటు చేయడంతో వెలువడే పొగా పిల్చడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## సభను విజయంతం చేయండి

బోధన్ రూరల్, అక్టోబర్ 30: వచ్చేనెల 9న ఆర్మూర్‌లో నిర్వహించనున్న ప్రజాపంథా మార్గదర్శకుడు డీవీకే (దుర్గంపూడి వెంకట కృష్ణ) స్మారక విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎం-ఎల్ )మాస్ లైన్ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్ కోరారు. బుధవారం బోధన్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతి శీల రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, సాయిలు, ఉశయ్య పాల్గొన్నారు.

## పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే



పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ జగన్

ఇందల్వాయి, అక్టోబర్ 30 : గన్నారం గ్రామానికి చెందిన నిజామాబాద్ రూరల్ మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కుంట మహిపాల్‌రెడ్డి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు.బుధవారం నిర్వహించిన అంత్యక్రియలకు రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ హాజరై పాడెమోశారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు.

## దూద్ పేడా తిని ఇద్దరు చిన్నారులకు వాంతులు

వినాయక్‌నగర్, అక్టోబర్ 30: దూద్ పేడా తిన్న అనంతరం ఇద్దరు చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటన జిల్లాకేంద్రంలో బుధవారం చోటచేసుకున్నది. నగరానికి చెందిన రమేశ్ అనే వ్యక్తి వినాయక్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఓ డెయిరీ ప్రొడక్ట్‌కు చెందిన దూద్‌పేడా డబ్బాను కొనుగోలు చేసుకుని ఇంటికి తీసుకెళ్లాడు. వాటిని తిన్న ఇద్దరు చిన్నారులు వాంతులు చేసుకున్నారు. దీంతో రమేశ్ వెంటనే నాల్గో టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. దూద్ పేడా విక్రయించిన డెయిరీ ప్రొడక్ట్స్ యజమానిని పోలీసులు విచారిస్తున్నారు. దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## విద్యుత్ వినియోగదారులకు టోల్‌ఫ్రీ సేవలు మరింత విస్తృతం

కంఠేశ్వర్, అక్టోబర్ 30 : టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించే క్రమంలో టోల్‌ఫ్రీ సేవలను మరింత విస్తృతపరినట్లు సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆర్.రవీందర్ తెలిపారు. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై టోల్‌ఫ్రీ 1912 నంబర్‌ను ముద్రిస్తున్నట్లు పేర్కొన్నారు.ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులున్నా, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, క్యాటగిరి, లోడ్ మార్పు తదితర సమస్యల కోసం టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించి సేవలు పొందాలని సూచించారు.

## కొనసాగుతున్న టీకాలు

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 30 : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మండలంలోని కేశ్‌పల్లిలో బుధవారం కొనసాగింది. గ్రామంలో 312 గేదెలు, 47 ఆవులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు జూనియర్ వెటర్నరీ అధికారిణి శశిరేఖ తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది అనిల్, రాజ్‌కుమార్, పద్మారావు, గ్రామ కమిటీ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

# త్వరలో పాల బిల్లులు చెల్లిస్తాం..

**రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డి**



మాట్లాడుతున్న అమిత్‌రెడ్డి

సారంగాపూర్, అక్టోబర్ 30: ఆశించిన స్థాయిలో పాల విక్రయం జరగని కారణంగా విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న రైతులకు బిల్లుల చెల్లింపుల్లో కొంత జాప్యం జరుగుతోందని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. బుధవారం ఆయన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో సారంగాపూర్‌లోని విజయ పాల డెయిరీ కేంద్రాన్ని సందర్శించారు. పాల సేకరణ, విక్రయాల తీరుపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాడి రైతులతో భేటీ అయ్యి వారి సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డి మాట్లాడుతూ పాడి రంగంపై ఆధారపడిన రైతులకు మేలు చేకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాడి పరిశ్రమకు ఇతోధికంగా తోడ్పాటునందిస్తున్నదని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, సారంగాపూర్ విజయ డెయిరీ యూనిట్ ఉపసంచాలకుడు నాగేశ్వర్‌రావు, పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు జగన్నాథచారి, కామారెడ్డి విజయ డెయిరీ ఉపసంచాలకుడు నందకుమారి, వెటర్నరీ ఏడీ బస్వారెడ్డి, ఆయా మండల పశు వైద్యాధికారులు బాబురావు, రతన్, సందీప్‌రెడ్డి, సురేశ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

# కూరగాయల సాగుపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే



దూపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విండో చైర్మన్ భూమారెడ్డి

మోర్తాడ్/నవీపేట/ రెంజల్/బోధన్ రూరల్/ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 30: వరికు బదులు రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. బుధవారం నవీపేట మండలం నాగేపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, నాగేపూర్ సొసైటీ చైర్మన్ శైలేశ్‌కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, మాజీ సొసైటీ చైర్మన్ మిర్యాల కిషన్‌రావు, నాయకులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ ప్రారంభించారు. రెంజల్ మండలంలోని దూపల్లి సహకార సంఘం, నీలా సహకార సంఘం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో తాడ్‌బిలోలిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను దూపల్లి విండో చైర్మన్ శేషుగారి భూమారెడ్డి, ఇమ్రాన్‌బేగ్ ప్రారంభించారు. సాలూరా మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ అంతయ్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లో పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ లావణ్య ప్రారంభించారు.

## సంక్షిప్తంగా..

- **ముల్లంగి చెరువులో చేప పిల్లల విడుదల:** డిచ్‌పల్లి, అక్టోబర్ 30: మండలంలోని ముల్లంగి చెరువులో ప్రభుత్వం అందించిన చేప పిల్లలను మాజీ ఎంపీపీ సిహెచ్.నర్సయ్య బుధవారం విడుదల చేశారు. చైర్మన్ గంగారెడ్డి, డైరెక్టర్ గంగారెడ్డి, సురేశ్, నర్సారెడ్డి, గూండ్ల గంగాధర్, రవి, సూరయ్య తదితరులున్నారు.
- **నిందితులపై చర్యలు తీసుకోవాలి:** డిచ్‌పల్లి/ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 30: కోల్‌కత్తా వైద్యురాలి హత్యాచార ఘటన నిందితులపై ఇప్పటివరకూ చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్ అన్నారు. మండలంలోని మోట్రాజ్‌పల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నోరు మెదకపోవడం సిగ్గుచేటన్నారు. పీవైఎల్ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, మహిళా నాయకులు స్వప్న, సాయిలు, లక్ష్మీ, కవి పాల్గొన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకుడు దాసు కార్మికులు పాల్గొన్నారు.
- **'డయల్ 100' దుర్వినియోగం.. ఒకరికి జైలు శిక్ష :** ధర్పల్లి, అక్టోబర్ 30: డయల్ 100ను దుర్వినియోగం చేసిన ఒకరికి జిల్లా రెండో క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ధనంబండ తండాకు చెందిన గుగులోత్ గణేశ్ మద్యం మత్తులో డయల్ 100 నంబర్‌కు కాల్ చేసి అసభ్యంగా మాట్లాడాడు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.
- **సాఫ్ట్‌బాల్ పోటీలకు సత్యశోధక్ విద్యార్థులు:** సిరికొండ, అక్టోబర్ 30 : మెదక్ జిల్లా మాసాయిపేటలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 2, 3వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ (అండర్-15) సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు కె.రోహిత్, ఎం.చందు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం అభినందించారు.
- **పటాకుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి:** సిరికొండ, అక్టోబర్30: పటాకుల దుకాణదారులు నిబంధనలు పాటించాలని ఫైర్‌సేఫ్టీ అధికారి ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు సిన పటాకుల దుకాణాలను బుధవారం పరిశీలించారు. లీడింగ్ ఫైర్‌సేఫ్టీ అధికారి జైపాల్ ఉన్నారు.
- **బోధన్ ఎమ్మెల్యే, మేయర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్:** కంఠేశ్వర్, అక్టోబర్ 30 : నిజామాబాద్ నగరపాలక సంస్థ నూతన కమిషనర్ దిలీప్‌కుమార్ బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితోపాటు నగర మేయర్ నీతూ కిరణ్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనే సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు.
- **జాతీయస్థాయి యోగా పోటీల్లో విజయ్ విద్యార్థి:** ఖలీల్‌వాడి, అక్టోబర్ 30 : హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 24 నుంచి 27 వరకు యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 49వ జాతీయస్థాయి యోగా పోటీల్లో విజయ్ హైస్కూల్ నాల్గో తరగతి విద్యార్థి ఎం.అనుషల్ ప్రతిభ కనబర్చాడు. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో పాల్గొని ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. విద్యార్థితోపాటు శిక్షకురాలు ఎ.రజితను విజయ్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు అమృతలత అభినందించి, సన్మానించారు.
- **పోలీస్ సిబ్బందికి వీడ్కోలు:** వినాయక్‌నగర్, అక్టోబర్ 30: పోలీసుశాఖలో ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి కమిషనర్ కార్యాలయంలో బుధవారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఆర్ ఎస్సై జి.లింగన్న, ఎస్సై బండి స్టీవెన్ అడ్విన్‌కు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు కోటేశ్వర రావు, బస్వారెడ్డి,శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.
- **ఉచిత కంటి వైద్య శిబిరం:** కోటగిరి(పోతంగల్), అక్టోబర్ 30: మండలంలోని వినాయక్‌నగర్‌కాలనీలో లయన్స్ క్లబ్ కోటగిరి డైమండ్ తేల రవికుమార్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నేత్రవైద్యుడు సతీశ్ కుమార్ పరీక్షలు నిర్వహించారు. 40 మందిని పరీక్షించి, 12 మందికి కంటి ఆపరేషన్ చేయాలని గుర్తించి బోధన్ లయన్స్ క్లబ్ దవాఖానకు తరలించారు.
- **పేకాట రాయుళ్ల అరెస్టు:** పోతంగల్, అక్టోబర్ 30: మండలంలోని జల్లాపల్లి ఫారంలో పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వారి నుంచి రూ. 7,530 నగదు స్వాధీనం చేసున్నట్లు పేర్కొన్నారు.
- **పోస్టర్ల ఆవిష్కరణ:** ఖలీల్‌వాడి, అక్టోబర్ 30 : మాదకద్రవ్యాల అరికట్టాలంటూ జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను డీఎంహెచ్‌వో బి.రాజశ్రీ, అదనపు కలెక్టర్ అంకిత్ బుధవారం ఆవిష్కరించారు. వినీత్‌రెడ్డి, రవితేజ, వెంకటేశ్వర్లు, స్వామి, సులోచన, వెంకటేశ్, నాగరాజు పాల్గొన్నారు.
- **హైమాస్ట్ లైట్ల ప్రారంభం -** బాల్కొండ, అక్టోబర్ 30: జలాల్‌పూర్ గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద హైమాస్ట్ లైట్లను బుధవారం నాయకులు ప్రారంభించారు.
- **క్రీడా దుస్తుల పంపిణీ -** జక్రాన్‌పల్లి, అక్టోబర్ 30: వీపీ ఉన్నతిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు.

## న్యాయం చేయాలని ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

రుద్రూర్, అక్టోబర్ 30 : తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ ప్రియురాలు ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ఘటన మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. నిజామాబాద్‌కు చెందిన ఫౌజియా తన తల్లిదండ్రులతో ఉంటున్నది. ఇదివరకే ఆమెకు వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని కారణాలతో ఫౌజియాతో విడాకులు తీసుకున్నది. రుద్రూర్ మండలం బొప్పాపూర్ గ్రామంలో ఉంటున్న దూరపు బంధువైన ముజీబ్.. ఫౌజియాతో ప్రేమ వ్యవహారం నడిపాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మబలికి నాలుగు నెలల పరిచయంలోనే గర్భవతిని చేశాడు. పెండ్లి చేసుకోవాలని అడుగగా పెండ్లి చేసుకునేది లేదని ఏం చేసుకుంటావో అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు తండ్రి, సోదరుడితో కలిసి బుధవారం ముజీబ్ ఇంటి ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. తనను ప్రేమించిన వ్యక్తి తనను పెండ్లి చేసుకునే వరకు పోరాడుతానని స్పష్టం చేసింది.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT: BODHAN.
(Old O.S.No. 161 of 2018 IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT: BODHAN.)
I.A. No. 302 of 2024
In
O.S. No. 90 of 2023

**Between:**
Kumari. Vasundhra :Petitioner /Plaintiff
And
Smt. Indrani and others :Respondent / Defendants

To,
KumariRavali, D/o Late Bansidhar, aged about 28 years, Occ: House hold, R/o., Nizamabad Town, Dist. Nizamabad. Whereas the Plaintiff, **Kumari Vasundhra,** has instituted an application bearing IA No. **302 of 2024** in **OS No. 90 of 2023** before this Hon'ble Court, seeking a suit for partition and separate possessions of Joint Hindu Undivided Family properties Take notice that the matter has been scheduled for hearing on **20-11-2024 at 10:30 AM.** You are hereby required to appear on the said date, either in person or through a pleader, to present your defense and answer the claims made by the Plaintiff. Failure to appear may result in the matter being adjudicated ex parte, based on the material available on record.
(By the order of the Hon'ble Court)
**Sd/- SRI SSR.KOTESHWARA RAO**
Advocate for the plaintiff
Bodhan, Cell: 98855 98885

## ఉపాధి హామీ పనుల గుర్తింపు

ఏర్గట్ల, అక్టోబర్ 30: మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో ఏపీవో వెంకటేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధిహామీ పథకంలో చేపట్టాల్సిన పనులను గుర్తించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ భూముల అభివృద్ధి, పండ్ల మొక్కల పెంపకం తదితర పనులు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఏ గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మాక్లూర్, అక్టోబర్ 30: గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దళారుల నుంచి రైతులను కాపాడాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్‌కు ఏఐకేఎంఎస్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు అబ్బయ్య, శివరాజ్, నర్సయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మత్తుపదార్థాల పట్టివేత

బోధన్ రూరల్, అక్టోబర్ 30: బోధన్ రూరల్ పోలీసులు సాలూరా అంతర్ రాష్ట్రచెక్‌పోస్ట్ వద్ద బుధవారం తనిఖీలు చేపట్టారు. తెలంగాణ నుంచి మహారాష్ట్రకు బస్సులో క్లోరోఫామ్ తోపాటు ఇతర మత్తు పదార్థాలు తరలిస్తున్న ఓ వ్యక్తి పోలీసులను చూసి బ్యాగ్ తీసుకొని పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు పట్టుకొని విచారించారు. నిందితుడి వద్ద 21 చిన్న ప్యాకెట్లలో మత్తుపదార్థాలు లభించాయి. కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

## జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

మాక్లూర్, అక్టోబర్30: మండలంలోని కల్లడి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ క్రీడా జట్టును బుధవారం ఎంపిక చేసినట్లు పీడీ పింజ సురేందర్ తెలిపారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి పోటీలు ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 2, 3, 4 తేదీల్లో ఆసిఫాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్1న మధ్యాహ్నం 3 గంటలకు ఆర్మూర్ బస్టాండ్‌లో పీటీ అనూషకు రిపోర్టు చేయాలని సూచించారు.

**రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక**

మోర్తాడ్, అక్టోబర్ 30: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని లక్ష్మి రాష్ట్రస్థాయి హ్యాండ్ పోటీలకు ఎంపిక కావడంతో బుధవారం ఆమెను హెచ్ఎం కృష్ణకుమార్, పీడీ మాధురి, ఉపాధ్యాయులు అభినందించారు.

**రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..**

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్30: అలూర్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శివ కుమార్, అదిత్య రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నరేందర్ బుధవారం తెలిపారు. కామరెడ్డిలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాలుర కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

## బీఆర్ఎస్ యువనాయకుని శ్రమదానం



పిచ్చిమొక్కలు తొలగింపజేస్తున్న సోంతే చినరాము

మాక్లూర్, అక్టోబర్30: కల్లడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల యువ నాయకుడు సోంతే చినరాము తన సొంత బ్లేడ్ ట్రాక్టర్‌తో బుధవారం శ్రమదానం నిర్వహించారు. కల్లడి నుంచి చిన్నాపూర్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.

## సైబర్ నేరాలపై అవగాహన

ఎడపల్లి, అక్టోబర్ 30: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఒడ్డపల్లి గ్రామంలో బుధవారం సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై నిజామాబాద్ పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినులకు అభినందన

మాక్లూర్, అక్టోబర్30: ఈ నెల 29, 30 తేదీల్లో జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో మహాత్మ జ్యోతిభాపూలే బీసీ గురుకులాల జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించగా నిజామాబాద్ అర్బన్ బాలికలు (దాస్‌నగర్) పాల్గొని పలు పతకాలను కైవసం చేసుకున్నారు. విద్యార్థులను బుధవారం ప్రిన్సిపాల్ స్వప్న, పీడీ నీరజ తదితరులు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



చింత కిషన్ (ఫైల్)

మోర్తాడ్, అక్టోబర్ 30: కమ్మర్‌పల్లి గ్రామ శివారులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మర్‌పల్లికి చెందిన చింత కిషన్(28) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతకిషన్, తన మిత్రుడు హరీశ్‌గౌడ్‌తో కలిసి స్కూటీపై గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో చింతకిషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన హరీశ్‌గౌడ్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## రైలు కింద పడి వివాహిత ఆత్మహత్య

వినాయక్‌నగర్, అక్టోబర్ 30: నగర శివారులోని అర్సపల్లి రైల్వే గేట్ పరిధిలో బుధవారం ఓ మహిళ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు.. అర్సపల్లికి చెందిన సుజాత అనే వివాహిత తన భర్త రవితో తరుచూ గొడవపడేది. మంగళవారం రాత్రి సుజాత తన ఇంటి పక్కవారితో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయింది. బుధవారం అర్సపల్లి వద్ద ఆమె మృతదేహాన్ని స్థానికులు గుర్తించి భర్తకు సమాచారం అందించారు. తన భార్య మృతికి ఎవరకు కారణంకాదని పోలీసులకు చెప్పినట్లు రైల్వే ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.